
◆ గురజాడ వీధి

# స్వర్ణభారతి



రాష్ట్ర రాజధాని భాగ్యనగరం.

జూన్ నెల చివరి రోజు సమయం మధ్యాహ్నం మూడు గంటలు.

ఎండ పేదవాడి ఆకలి కడుపులా భగభగమండుతోంది.

కుడిభుజం మీద వేలాడుతున్న రెండు గోనె సంచుల్నీ ఎడం భుజం మీదికి మార్చుకుంట ఆకాశంకేసి చూశాడు అచ్చిగాడు. డబ్బున్న ఆసామి చూపులా ఎండ చురుక్కున గుచ్చుకుంది.

దోమలగూడా చౌరస్తాలోకి రాగానే వాడికి చెత్తకుప్ప కన్పించి ప్రాణంలేచివచ్చింది. చెత్తవేయటం కోసం నిర్దేశించిన సిమెంట్ తొట్టికి చుట్టుపక్కలా నడుం ఎత్తున పేరుకుని ఉంది చెత్త. వాడికి ఆ చెత్తలో, అలనాడు అర్జునుడికి పక్షి కన్నుతప్ప మరేమీ కన్పించనట్టు, చిత్తు కాగితాలూ ప్లాస్టిక్ వస్తువులూ తప్ప మరేమీ కన్పించటంలేదు.

అచ్చిగాడు కుప్పతొట్టి దగ్గరకు వచ్చేవరకూ గమనించనే లేదు. దాని చాటున కూచుని ఎండిపోయిన రొట్టె ముక్కల్ని ఏరుకుని తింటున్న వాణ్ణి. వాడికి పన్నెండేళ్ళుంటాయి. ఒంటి మీద చిరిగిన నిక్కరు తప్ప మరే ఆచ్ఛాదనా లేదు. ఎముకలు చర్మంలోంచి పొడుచుకు వచ్చి కన్పిస్తున్నాయి. వాడి పక్కనే గోనెసంచీ ఉంది. తన జాతివాడే అనుకున్నాడు అచ్చిగాడు.

ఎంగిలిస్తరాకుని నాకుతున్న వూరకుక్క, మరో కుక్కను చూసి మండిపడ్డట్టు వాడు మొదట అనుమానంగా చూసి, తర్వాత కోపంగా లేచి నిలబడ్డాడు. అచ్చిగాడికి కడుపులో దేవినట్టయింది. వాడివైపు వాత్సల్యంగా చూసి మెల్లగా నవ్వాడు. వాడికి అర్థంకాలేదు. తనకు చెత్తకుప్పలో దొరికిన రొట్టె ముక్కల్ని లాక్కుంటాడేమోనన్న భయంతో పిడికిళ్ళతో బలంగా పట్టుకుంటూ మరలా అనుమానంగా చూశాడు. అప్పటికే అచ్చిగాడు అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. 'ఈ వూర్లో చెత్తకేం తక్కువ... కావాల్సినంత' అనుకుంటూ.

ఇంకో వీధిలోకి తిరిగి చెత్తకుప్ప దగ్గరకెళ్ళాడు. కాగితాలు ఉండలు చుట్టి పడేసి ఉన్నాయి. తెల్లటి ఉండలు ఉండలు వాడికి చప్పన అన్నంముద్దలు గుర్తుకొచ్చాయి. చేత్తో గుండ్రంగా చేసిన తెల్లటి అన్నంముద్దలు. ఆకలి పేగుల్నిమెలితిప్తూ ఆకలి. ఉదయం అనగా తిన్న సద్దన్నం. గోనెసంచులు పూర్తిగా నిండితేకానీ నాలుగు పైసలు విదల్చడు ఆ సేఠ్. వాళ్ళ రక్తమాంసాలు పీల్చి బలిసిన సేఠ్ గుండ్రటి మొహం గుర్తొచ్చి తుపుక్కున వూసాడు అచ్చిగాడు.

చిత్తుకాగితాలు ఓ గోనెసంచిలో ప్లాస్టిక్ వస్తువులు మరో గోనెసంచిలో ఏరివేశాడు. చెత్తో చెత్తను కెలుకుతుంటే ఏదో పదునైన వస్తువు తగిలి వేలు తెగింది. రక్తం.. ఎర్రటి చిక్కటి రక్తం... చేతికున్న మురికితో కలిసి చిక్కబడ్తోన్న రక్తం... ఆ వేలు నోట్లో పెట్టుకున్నాడు. మట్టివాసనా... రక్తం వాసనా.. కల్సిన రుచి.

ఆకలీ... నిస్సత్తువా... నిస్త్రాణా...అలానే సిమెంటు తొట్టికి ఆనుకుని కూచున్నాడు. ఎప్పటికి మల్లే వాడికి వాళ్ళమ్మ చిన్నప్పుడు చెప్పిన కథ గుర్తొచ్చింది. ఆ కథలో వాడికి మల్లే ఓ పేద

— సలీమ్

యువకుడుంటాడు. వాడి మొహం చూసిన జ్యోతి ష్యూలు ఏదో ఓనాడు రాజౌతావని చెప్తి ఉంటారు. ఆగర్భ దరిద్రుడు రాజెలా అవుతాడని ఆ వూరి ప్రజలందరూ నవ్వుకుంటూ ఉంటారు. ఓ రోజు ఆదేశపు రాజు చనిపోతాడు. అతనికి పిల్లలు లేనికారణంగా పట్టపుటేనుగు ఎవరి మెడలో దండవేస్తే వారే ఆ దేశానికి రాజని చాటింపు వేయిస్తారు. ఆ ఏనుగు పూలదండను పట్టుకుని వీధులన్నీ తిరిగి, తిరిగి, చివరికి ఆ పేద యువకుడి మెడలో వేస్తుంది.

ఈ కథంటే అచ్చిగాడికి చాలా ఇష్టం బోల్డంత ఇష్టం. ఆ కథలోని పేద యువకుడు తనే అయినట్టు... తను రాజై సింహాసనం మీద కూచున్నట్టు ఆ వూహ కొన్ని వందల సార్లు వాడికి వూరటనిచ్చింది. అప్పుడు వాడికి ఆకలి గుర్తు రాదు. లేమిగుర్తు రాదు. ఎండావానా తెలీవు. ఆ వూహ మృత సంజీవిని లాంటిది. పట్టపుటేనుగు పూలదండను తన మెడలో వేసి తొండంతోతనను దీవిస్తున్నట్టు.

'ఏయ్ లేరా' అనే పిలుపుతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. ఎదురుగా పట్టపుటేనుగు లేదు కానీ మదగజం లాంటి ఓ భారీ మనిషి నిలబడి ఉన్నాడు. తెల్లటి ప్యాంట్, మరీ తెల్లటి షర్ట్, చలువ కళ్ళద్దాలు... ఓ భుజానికి వేలాడే సంచీ, మరో భుజానికి వూగుతూ కెమెరా...


'ఏయ్..నిన్నే' అన్నాడు మళ్ళా... చెత్తకు దూరంగా నిలబడి... కర్చీఫ్‌తో ముక్కు మూసుకుంటూ.

అచ్చిగాడు భయంగా లేచి నిలబడ్డాడు.

'నీ పేరేంటి' గుద్దిస్తున్నట్టు అడిగాడు.

'అచ్చిగాడంటారు దొరా' అన్నాడు భయం భయంగా.. వాడిక గుండెల్లో చెత్తను మోసు కెళ్ళే వేల లారీల రొద... తనేం తప్ప చేశాడూ?

“చిత్తు కాగితాల
జీవన భారతంలో
'వందే మాతరం' అని
విలవిల్లాడుతున్న
బాల్యం ఏ వ్యవస్థకు
నిదర్శనం?”



చిత్తు కాగితాలు ఏరు కోవటం తప్పా? ఈ పనిని కూడా ప్రభుత్వం కాంట్రాక్టర్ల కప్పేసిందేమో! లేక సిమెంటు తొట్టెని ఆనుకుని కూచున్నందుకు దొరగారికి కోపం వచ్చిందా? కూచుని కునికి పాట్లు పడటం తనుచేసిన తప్పా? ఓ నిముషం ఆలోచించాక ఇవేవీ కాదేమోననిపించింది. తను రాజైనట్టు వూహల్లో విహరించాడూ... అద్గదీ తప్ప 'ఏరా యెదవ నాయాలా.. చెత్త కుప్పల్లో చిత్తు కాగితాలేరుకునే నీవు రాజెలా అవుతావు. అది మా లాంటి దొరబాబులకే సాధ్యం' అని తిట్టటానికొచ్చాడు అనుకున్నాడు అచ్చిగాడు.

'నువ్వా చెత్తలోంచి ఇలా బైటికి రారా నీతో మాట్లాడాలి' చెత్త నుంచి మరింత దూరంగా జరుగుతూ అన్నాడు దొరబాబు.

అచ్చిగాడు మెల్లగా, భయంగా అతని వైపుకు నడుస్తూ, 'పొరపాటైపోయింది దొరా... ఇంకెప్పుడూ కలల్లో కూడా. అలా కోరుకోను దొరా.. నన్ను క్షమించి వదిలేయండి' అన్నాడు అతని పాదాలు ముట్టుకుంటూ.

'ఛీ దూరంగా ఉండు. ప్యాంటు పాడైపోతుంది' అచ్చిగాడి మురికి పట్టిన శరీరం దుమ్ముకొట్టుకుపోయిన చేతులవైపు అసహ్యంగా చూస్తూ అన్నాడు దొరబాబు. అతనికి రెండు గజాల దూరం జరిగి,

'నా పేరు కృపానిధి. నేను జర్నలిస్ట్‌ని నేనడిగే ప్రశ్నలకు నీవు సమాధానాలు చెప్తే వాటిని

## ఏది ఉత్తమం?



ఆత్మ వత్తనె సకలము హైందవమ్ము
దయను బోధించే బౌద్ధము త్యాగ మహిమ
చాటే క్రైస్తవ, మిస్లాము శాంతి పేర
వెలపె, నియ్యది గమనింప వలయు సుమ్ము!

ఏమి చదివెను క్రీస్తు తానేమి చదివె
ముహిమీదన లోకమాన్యత పొంది జగతి
పూజలను పొందగల్గి రపూర్వ రీతి
హేతువది యేమొ మది విచారింపు మిత్ర!

అరదు క్రీస్త్వాది మహనీయు లఖిల జగతి
వంద్యాలగుటకు హేతు వపారమైన
కరణ భరితము, ప్రేమ పాగరమునైన
హృదయమే వని గ్రహియింపు తెలయ మిత్ర!

మతము వివరించు నుత్తమ మార్గములను
వదలి మనుజులు మూఢ భావముల తోడ
తన్నుకొనుచుందురూ! మతమ్ము పేర
ఏమి చిత్రమొ, ఇది చెప్పలేము, సుమ్మి!

అవని మంచిని బెంచు మానవత కంటె
ఉత్తమంబైన మతము పేరొంద లేదు
మానవత్వము మనుజుని మహిత జేసి
శాంతి సౌఖ్యము లొడగూర్చి జగతి నిజము

పాటి బండ్ల వెంకటపతిరాయలు.

పేపర్లో వేయిస్తాను. నీకు డబ్బులు కూడా ఇస్తాను' అన్నాడు.

'నేను చదువుకోలేదు దొరా... చిత్తు కాగితాలు ఏరుకునే వాడిని... నాకేం తెలుస్తాయి?'

'నాక్కావల్సింది నీలాంటి వాళ్ళ అభిప్రాయాలే. స్వాతంత్ర్యం స్వర్ణోత్సవాల సందర్భంగా పత్రిక్కి ప్రత్యేక వ్యాసం రాయాలనుకుంటున్నాను. ఇందుగ్గాను నీకు వంద రూపాయలిస్తాను.

అచ్చిగాడి కళ్ళు మెరిశాయి. వంద రూపాయలు అమ్మపుట్టిన రోజు రాబోతుందిగా అమ్మ కోసం చీరకొనొచ్చు. 'అడగండి దొరా. వంద రూపాయల కోసం మీరేం అడిగినా చెప్తాను' అన్నాడు.

'నీ పేరేంటి.'

'అచ్చిగాడంటారు దొరా... చదువుకునే తాహతులేక చదువుకోలేదు. నా అసలు పేరు అక్షయ్. అది అచ్చయ్‌గా మారి చివరికి అచ్చిగాడైంది.'

'నీకు స్వరాజ్యం అంటే తెలుసా'

'తెలియదు. నాకు మా అమ్మ సొరాజ్జెం మాత్రం తెలుసు. యాభై యేళ్ళ క్రితం మనకు సొతంత్రం వచ్చిన రోజు పుట్టిందని మా తాత ఆ పేరు పెట్టాడట.'

'అంటే మనకు స్వతంత్రం వచ్చిన విషయం నీకు తెల్సన్నమాట.'

'మా అమ్మమ్మ చెప్పుండేది. మా తాత తెల్లోడి తుపాకీకి బలైపోయాడట. గాంధీతాత తెల్లదొరల్ని తరిమి కొట్టాడట. ఇంతకూ స్వతంత్రం అంటే ఏమిటి దొరా?'

కృపానిధి నవ్వాడు. సిగరెట్‌తీసి ముట్టించి, ఓ దమ్ములాగి చెప్పాడు. 'స్వతంత్రం అంటే నీవు ఎవరికీ బానిసవుకావు. నీ ఇష్ట ప్రకారం బ్రతకొచ్చు. చదువుకోవాలంటే చదువుకోవచ్చు. ఉద్యోగం చేయాలంటే చేయవచ్చు. ఎవ్వరూ అడ్డుచెప్పరు.

అచ్చిగాడికి అర్థంకాలేదు. 'నాకు చదువుకోవాలని ఉంది. కానీ డబ్బుల్లేవు కాబట్టి చిత్తుకాగితాలేరుకుంటున్నా నాకు కదుపునిండా తినాలని ఉంది. కానీ గంజినీళ్ళకు కూడా గతిలేదు. ఇదేం స్వతంత్రం దొరా. అయితే స్వతంత్రం రాలేదు. నాకు ఆకలి నుంచి, దారిద్ర్యం నుంచీ, అవసరాల నించీ స్వతంత్రం రాలేదు. నేను బానిసనే.'

కృపానిధి విసుగ్గా మొహం పెట్టాడు. 'సర్లే... నీవు ప్రధాన మంత్రి అయ్యావనుకో.. ఏం చేస్తావు' అన్నాడు.

'ప్రధాన మంత్రి అంటే ఏమిటి దొరా... రాజు దగ్గిర ఉంటాడూ మంత్రి... అలానా.

'అలా కాదు. ఇప్పుడు రాజోలు వేరు. ప్రధాన మంత్రే ఈదేశానికి రాజులాంటివాడు. నీవు ప్రధాన మంత్రి అయితే అంటే ఈ దేశానికి రాజువయితే ఏం చేస్తావు.'

వాడికి ఓ క్షణం అర్థం కాలేదు. అయ్యాక తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు. అనుమానంగా, భయంగా చూశాడు దొరవైపు.. ఇతనేమీ హాస్యం ఆడటం లేదు కదా..

'నేను రాజునెలా అవుతాను దొరా' అన్నాడు.

'ఎందుక్కాకూడదూ. చదువు రాకున్నా మట్టి పిసుక్కునే వాడైనా గొంతులు పిసికేవాడైనా.. ఎవ్వరైనా ప్రదాన మంత్రి కావొచ్చు. అలా అయితే మొదట ఏం చేస్తావు?'

అచ్చిగాడు వెంటనే చెప్పాడు, "మా అమ్మకు ఒంటిమీద సరియైన బట్ట లేదు దొరా... అందుకే అమ్మకో మంచి చీర కొనిపెడ్తాను."

"ఆ తర్వాత"

"మా అమ్మ కడుపునిండా భోంచేసి ఎన్నాళ్ళయిందో... తన గురించి పట్టించుకోకుండా తన కడుపు మాడ్చుకుని నాకు పెడ్తుంది. మా అమ్మకు కడుపు నిండా అన్నం పెడ్తాను."

"అమ్మ గురించే చెప్తున్నావు - నీ కింకెవ్వరూ లేరా?"

"ఎందుకు లేరూ... మా నాన్న చాలా తెలివి గలవాడు - దుర్మార్గపు తెలివి - రాజకీయాల్లో తిరుగుతూ... ఓ రోజు అమ్మ నగలన్ని మూటగట్టుకుని, అమ్మను వదిలేసి పారిపోయాడట. ఇప్పుడు బాగా డబ్బు సంపాదించాడు. పలుకుబడీ - హోదా - కార్లు - బంగళాలు అన్నీ ఆర్జించాడు. గొప్పవాడిగా చెలామణి అవుతున్నాడు... అమ్మ గురించి మాత్రం పట్టించుకోడు."

"ప్రస్తుతం ఏ పార్టీలో వున్నాడు?"

"ఒక పార్టీ అని ఏముంది? అన్ని పార్టీల్లోనూ వుంటాడు. డబ్బుకోసం ఎంత నీచమైన పనైనా చేస్తాడు" అచ్చిగాడి కళ్ళలో అసహ్యం...

"అన్నలూ... తమ్ముళ్ళూ... కృపానిధి మరలా ప్రశ్నించాడు.

"ముగ్గురన్నలున్నారు... ఏం లాభం? అమ్మ దగ్గర్నుంచి ఏం గుంజుకుందామని చూసేవాళ్ళే తప్ప అమ్మ బాగోగులు పట్టించుకోరు. మా అమ్మ సంపన్నురాలే... అమ్మమ్మ వాళ్ళిచ్చిన బోల్డు డబ్బూ, ఇల్లూ, పొలాలూ వుండేవి. పెద్దన్న పోలీసు. అమ్మను బెదిరించి, భయపెట్టి వున్న పొలమంతా లాక్కున్నాడు. ఇవ్వనంటే మోకాలి చిప్పలు పగులగొట్టి మరీ లాక్కున్నాడు. రెండోవాడు లాయరు. అమ్మమీద కేసుపెట్టి - బోనులో నిలబెట్టి - సాక్షుల్ని కొనేసి - తిమ్మిని బమ్మిని చేసి - ఇల్లు లాగేసుకున్నాడు. మూడో అన్న గవర్నమెంటాఫీసులో పని. వాడు పరమ లంచగొండి. ఏం పని చేయాలన్నా అమ్మ దగ్గిర లంచం అడిగేవాడు. చివరికి వాడి పెళ్ళాంతో కాపురం చేయాలన్నా అమ్మను లంచం అడుగుతాడు. వాడు అమ్మను హింసించి, హింసించి - ఆమె దగ్గరున్న డబ్బంతా కొట్టేశాడు."

"నీ ముగ్గురన్నలూ పెద్ద చదువులు చదువుకుని

ఉద్యోగాలు చేస్తుంటే నీవిలా ఎందుకయ్యావు?"

"వాళ్ళ వల్లనే దొరా! వాళ్ళను చదివించడం కోసం నా చదువు ఆగిపోయింది. వాళ్ళ ముగ్గురికీ మంచి భోజనం పెట్టడం కోసం నేనూ అమ్మా పస్తులున్నాం. ఇప్పుడు వాళ్ళు మంచి హోదాల్లో వున్నారు. కానీ అమ్మకు పట్టెడన్నం పెట్టరు. యాభై యేళ్ళకే అమ్మ డెబ్బై యేళ్ళ ముసిల్దానిలా అయిపోయింది. శరీరం అంతా శుష్కించి ఎముకల గూడులా వుంది. అయినా ఇంకా పీక్కుతినాలనే చూస్తారు. నాకు అమ్మంటే ప్రేముంది. కానీ చదువు లేదు – ఉద్యోగం లేదు –. కటిక పేదవాణ్ణి" వాడి కళ్ళలో నీరు కదిలింది.

"నాకో అక్క కూడా వుండేది దొరా – కుంద నపు బొమ్మలా... పెళ్ళయ్యాక, అడిగినంత డబ్బు తేలేదని మొగుడూ అత్తా కలిసి కిరోసిన్ పోసి కాల్చేశారు" అచ్చిగాడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

కృపానిధిక విసుగనిపించింది. అనవసరంగా ఈ సోదంతా కదిపానే... ఎంత చెత్త... ఎంత ట్రాష్... అనుకున్నాడు.

"సర్లే... సర్లే... నీవెళ్ళి ఓసారి ఆ చెత్తకుండీ పక్కన నిలబడు – నీ ఫోటో తీస్తాను" అన్నాడు.

అచ్చిగాడు తన గోనె సంచుల్తో వెళ్ళి చెత్తకుండీ ధ్గగర నిలబడ్డాడు.

"కొద్దిగా నవ్వు" అన్నాడు కృపానిధి.

"నవ్వెలా వస్తుంది దొరా... మీరు అమ్మను గుర్తుకుతెచ్చాక" అన్నాడు మురికిచేత్తో బుగ్గలు తుడుచుకుంటూ.

కృపానిధి ఫోటో తీసుకున్నాక, "ఓ రెండ్రోజులాగి ఇక్కడితే రా... నీకు వంద రూపాయలిస్తాను" అన్నాడు.

వంద రూపాయలొస్తే అమ్మకు చీర కొనొచ్చని ఆశపడ్డ అచ్చిగాడు అర్థం కానట్టు చూశాడు.

"ఇపుడివన్నీ ఎడిటర్ గారికి చూపిస్తే నాకు డబ్బులిస్తారు. అందులోంచి నీకు వంద రూపాయ లిస్తా – ఎల్లుండి రా... మర్చిపోకు" కృపానిధి వెళ్ళిపోయాడు.

అచ్చిగాడు రెండ్రోజుల తర్వాత వెళ్ళి ఆ చెత్త కుండీ దగ్గరే కూచున్నాడు. కృపానిధి రాలేదు. ఆ తరువాత ప్రతిరోజూ వెళ్ళి – అక్కడే కూచుని – ఆశగా ఎదురు చూశాడు. కృపానిధి రాలేదు.

* * * * *

ఆగస్ట్ పదిహేను – *1997.*

అచ్చిగాడు ఉదయం ఆరింటికే నిద్రలేచాడు. అప్పటికే సారాజ్జెం తలంటుస్నానం చేసి, ఉన్న ఒక్క పాత చీరనే కట్టుకుని వుంది.

అచ్చిగాడు అమ్మవైపు ప్రేమగా, భక్తిగా చూస్తూ, "ఈరోజు నీ యాభయ్యో పుట్టినరోజు కదమ్మా – శుభాకాంక్షలు" అన్నాడు.

ఆమె దిగులుగా నవ్వింది.

ఆ దిగులెందుకో అచ్చిగాడికి తెలుసు. రెండ్రో జుల్నించీ కుండపోతగా వర్షం... బైటికి కాలు పెట్ట టానికి వీల్లేకుండా వదలకుండా కురిసిన వర్షం... రెండ్రోజుల్నించీ గోనెసంచులు ఖాళీ... వాళ్ళ కడుపులు కూడా ఖాళీయే...

"తొందరగా పనికెళ్ళుబాబూ" అంది సారాజ్జెం.

"ఈరోజు కూడానా అమ్మా..." అన్నాడు అచ్చి గాడు. వాడికి వళ్ళంతా నొప్పులు – జ్వరం వచ్చినట్టు సలుపుతోంది. చెపితే అమ్మ బాధ పడ్తుందని చెప్పలేదు.

తన కొడుకు కోరిన అతి చిన్న కోరిక కూడా తీర్చ లేని తన నిస్సహాయత తెలిసి ఆ తల్లి హృదయం తల్లడిల్లింది.

"అలా అంటే ఎలా నాయనా... గంజినీళ్ళకు కూడా గతిలేని మనకు పుట్టిన్రోజు సంబరం ఏముం టుంది? ఈరోజు ఎలాగూ పస్తే... నీవు పని మానేస్తే, రేపు కూడా పస్తులుండాల్సి వస్తుంది" సారాజ్జెం గొంతు బాధతో వణికింది.

అచ్చిగాడికి గుండె పిండేసినట్టయింది. వాడు గోనె సంచుల్ని భుజాన వేసుకుని బైటపడ్డాడు...

బైట పండగలా వుంది... అందరూ కొత్త కొత్త బట్టలు వేసుకుని సంతోషంగా కన్పించారు. చౌరాస్తాలో జెండా ముందు నిలబడి ఎవరో రాజ కీయ నాయకుడు మైకులో "పేదరిక నిర్మూలన" గురించి పెద్దగా మాట్లాడుతున్నాడు. తన ప్రభుత్వో ద్యోగి, పోలీసు, లాయరు అన్నలు హడావిడిగా, ఉత్సాహంగా అటూ, ఇటూ తిరుగుతున్నారు.

అచ్చిగాడికి కసిగా – కోపంగా వుంది. అక్కడ అమ్మ ఆకలితో అల్లాడుతుంటే ఇక్కడ వీళ్ళందరూ మిఠాయిలు తింటున్నారు.

అక్కడ అమ్మ చినిగిన చీరలో వళ్ళు దాచు కుంటే – ఇక్కడ అందరూ రకరకాల రంగురంగు దుస్తుల్లో వెలిగిపోతున్నారు.

అక్కడ అమ్మ కన్నీరు కారుస్తుంటే – ఇక్కడ కారణం లేకుండానే పగులబడి నవ్వుకుంటున్నారు.

అచ్చిగాడు అన్యమనస్కంగా చెత్తకుప్పలోంచి కాగి తాలు ఏరి గోనె సంచిలో వేస్తున్నాడు. అవి వర్షానికి తడిసి ముద్దముద్దగా వున్నాయి. ఆ కాగితాల్లో – కృపానిధి వాడి గురించి రాసిన వ్యాసం – వాడి ఫోటోతో సహా వుంది. కానీ చెత్త కుప్పలో పడటం వల్ల – రాత్రి వర్షానికి చివికి పోవడం వల్ల – బురద అంటుకుని వుండటం వల్ల – వాడు గుర్తుప ట్టలేకపోయాడు. మిగతా కాగితాల్తో పాటు దాన్ని కూడా గోనె సంచిలో కుక్కి, భుజాన వేసుకుని, మరో చెత్తకుప్పను వెతుక్కుంటూ బయల్దేరాడు.

వాడి వెనక నించి మైకులో, 'సారే జహాసే అచ్ఛా – హిందూసతా హమారా' అనే పాట విన్పిస్తోంది.

◆





**హోలియా, కామకేళియా**

బాబీడియోల్ ఇంట్లో ఎలాంటి పూజలు చేయ రట. అతని కుటుంబం ఆర్య సమాజ్‌కు చెందింది. ఇతనికి దీపావళి పండుగ అంటే ఇష్టమే కాని హోలి అంటే ఇష్టం లేదట. ఎందుకంటే కొందరు అబ్బాయిలు రంగులు పులిమే నెపంతో అమ్మాయిల శరీరాన్ని తడమడానికి ప్రయత్నిస్తుంటారట.




**1 వ బహుమతి:** యూరప్‌లోని ఏ ప్రాంతానికైనా ఒక రిటర్న్ ఎయిర్ టిక్కెట్ (లేదా) 20'' కలర్ టి.వి. (లేదా) హీరో హోండా మోటార్ సైకిల్ (లేదా) చేతక్ స్కూటర్

**2 వ బహుమతి:** ఎం.బి. పథకము ప్రకారం టూ-ఇన్-వన్/3 స్పీడ్ మిక్సర్-కమ్-గ్రైండర్

**3 వ బహుమతి:** 10 గ్రాముల బంగారు ఆభరణాల సెట్టు (లేదా) 200 ఇతర పారితోషికములు

**ఆశ్చర్యకరమైన బహుమతులు:** ఎం. బి. పథకముల ప్రకారం డైనాక్స్ ఎ.సి. / డి.సి. ట్రాన్సిస్టర్ సెట్/ క్వార్ట్జ్ రిస్ట్ వాచ్ & కలర్ ఫోటో కెమెరా.

ఈ ప్రశ్నలకు పోస్టుకార్డుపై జవాబులు వ్రాసి 7 రోజులలోగా పంపండి. ఒక కుటుంబం ఒక్క ఎంట్రీని మాత్రమే పంపాలి.

1) మీకు ప్రముఖముగా వినిపించే పేరు ఏది: ______
(హిందుస్థాన్/ ఇండియా/ భరత్‌వర్ష)

2) అత్యంత విజయుడైన భారతీయ క్రికెట్ కెప్టెన్ పేరు: ______
(కపిల్‌దేవ్/ అజారుద్దీన్/ సచిన్ టెండూల్కర్)

3) అత్యంత పూజ్యనీయమైన నటుడి నుంచి రాజకీయనాయకుడైన వ్యక్తి ఎవరు ______
(ఎం. జి. రామచంద్రన్/ ఎన్. టి. రామారావు/ రజనీకాంత్)

4) భారత దేశంలో ఓటు వేయుటకు వయో పరిమితి: ______
(18 సంవత్సరములు / 21 సంవత్సరములు)

Send your entry to :

**UNISAF ENTERPRISES ( B-34 )**

6, Kamal Vihar, Delhi-110 094